ప్రమాదభరితం..!

- భయపెడుతున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు
- భూగర్భ విద్యుత్ అందుబాటులోకి రావడంతో నిరుపయోగం
- స్థానికులు, వాహనదారుల్లో ఆందోళన

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు ప్రమాదభరితంగా మారాయి. జీవీఎంసీ 17, 18, 19 వార్డులతోపాటు 20వ వార్డులోని చినవాల్తేరు, పెదవాల్తేరు ప్రాంతాల్లో అనేక చోట్ల ఈ సమస్య ఉంది. తుఫాన్లు, భారీ వర్షాల సమయంలో పలు చోట్ల కూలిపోయే ప్రమాదం సైతం ఉండటంతో స్థానికులు, వాహన చోదకులు భయాందోళనలకు గురవుతున్నారు.

నగరంలో భూగర్భ విద్యుత్ వ్యవస్థ అందుబాటులోకి రావడంతో పాత విధానంలోని ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలను కొంతమేర తొలగించారు. చాలా చోట్ల వాటిని తూర్పు విద్యుత్ పంపిణీ సంస్థ వదిలేయడంతో ప్రస్తుతం అవి ప్రమాదకరంగా.. నిరుపయోగంగా మారాయి. 17వ వార్డులో టీటీడీ కల్యాణ మండపం రోడ్డును ఆనుకొని ఉన్న విద్యుత్ స్తంభాల సముదాయం భయపెడుతోంది. దాని పక్కనే అనేక మంది చిరు వర్తకులు వ్యాపారాలు చేసుకుంటున్నారు. వినియోగంలోని లేని ఈ విద్యుత్ స్తంభాల సముదాయాన్ని తొలగించకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 19వ వార్డు లాసన్స్ బే కాలనీ రోడ్డులో, 20వ వార్డు చినవాల్తేరు సీబీఐ డౌన్ రోడ్డులో విద్యుత్ స్తంభాలు, మినీ ట్రాన్స్‌ఫార్మర్ సముదాయాలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఎటువంటి అపాయం జరగక ముందే విద్యుత్ శాఖ అధికారులు దృష్టి సారించి వాటిని తొలగించాలని ఆయా ప్రాంతాల వాసులు, వాహన చోదకులు కోరుతున్నారు.


టీటీడీ రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాల సముదాయం


చినవాల్తేరు రోడ్డులో నిరుపయోగంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాల సముదాయం

ప్రమాదకర విద్యుత్ స్తంభాలను తొలగించాలి

ఎంవీపీ కాలనీ పరిధిలో పలు చోట్ల నిరుపయోగంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలను తక్షణం తొలగించాలి. వాటి వల్ల ప్రమాదం పొంచి ఉంది. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ఎటువంటి ప్రమాదం జరగకుండా రక్షణ చర్యలు చేపట్టాలి. – **సంతోష్‌కుమార్, ఎంవీపీ కాలనీ**

‘రన్ ఫర్ అంబేడ్కర్’ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు, నిర్వాహకులు

విశాఖ సిటీ: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని నవంబర్ 26న ఆర్‌కే బీచ్‌లో నిర్వహించనున్న రన్ ఫర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కార్యక్రమ పోస్టర్‌ను గురువారం ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు ఆవిష్కరించారు. రాజ్యాంగ గొప్పతనం, పౌరులకు సంక్రమించిన ప్రాథమిక హక్కులు, స్వేచ్ఛ, ఇంత అంశాలపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఆలుమ్నీ వెల్ఫేర్ అసోసియేషన్ సొసైటీ ప్రతినిధులు తెలిపారు. ఏయూ విద్యార్థి పరిశోధక బోధన, బోధనేతర సిబ్బంది, అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ, భీమ్ సేన వారి భాగస్వామ్యంతో జరుగుతున్న ఈ కార్యక్రమంలో అందరూ భాగం కావాలని కోరారు. దీనికి రిజిస్ట్రేషన్ ఉచితమని, కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ టీ షర్టు ఉచితంగా అందిస్తామన్నారు. ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ వరకు రన్ కొనసాగుతుందని, బహిరంగ సభతో ముగుస్తుందని తెలిపారు. 10 వేల మంది హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావు, కాలేజీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.రాజు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఆలుమ్నీ వెల్ఫేర్ అసోసియేషన్ సొసైటీ అధ్యక్షుడు ఆచార్య కోటి జాన్, ప్రధాన కార్యదర్శి ఆరేటి మహేష్‌బాబు, స్టాటస్టిక్స్ విభాగం పూర్వ ఆచార్యుడు వివేకానందమూర్తి, డాక్టర్ బోరుగడ్డ మోహన్ బాబు, ఏయూ ఎస్సీ ఎస్టీ, బీసీ–సీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆచార్య టి.షారోన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

దసరా వేళ.. కొండెక్కిన నాటుకోడి


డెయిరీఫారం వద్ద విక్రయిస్తున్న నాటుకోళ్లు

ఆరిలోవ: దసరా ఉత్సవాల సందర్భంగా నాటుకోళ్ల ధరలు కొండెక్కుతున్నాయి. మటన్ ధరను మించి వీటి ధర పెరిగిపోతోంది. సాధారణంగా దసరాకు కంపెనీలు, యంత్రాలు, పెద్ద వాహనాలకు గొర్రెలు, నాటుకోళ్లు కోస్తుంటారు. డిమాండ్ పెరగడంతో వీటి ధర మటన్‌తో సమానంగా పెరిగిపోయింది. జాతీయ రహదారిపై డెయిరీఫారం వద్ద నిత్యం నాటుకోళ్ల సంత జరుగుతుంది. ఇక్కడ నాలుగు రోజులుగా వీటి ధరలు ఎగబాకాయి. ఇంతవరకు లైవ్ కిలో రూ.600 ఉండే ధర.. రూ.800కు పెరిగింది. రెండున్నర కిలోల కోడి కొంటే దాని నుంచి 2 కిలోల లోపే మాంసం పడుతుందని వినియోగదారులు చెబుతున్నారు. దసరా వేళ డిమాండ్ పెరగడంతో ధరలకు బాగా రెక్కలొచ్చాయని తప్పని పరిస్థితిలో కొనాల్సి వస్తోందని అంటున్నారు.

క్లుప్తంగా

ఎంవీపీ రైతుబజార్‌లో సబ్సిడీ వంట నూనెలు


వినియోగదారులకు సబ్సిడీ వంట నూనెలు అందిస్తున్న అధికారులు

ఆరిలోవ: మార్కెటింగ్ శాఖ అధికారులు ఎట్టకేలకు నిత్యావసర సరకులపై సబ్సిడీలు అమలు చేస్తున్నారు. కూరగాయలతోపాటు సరకుల ధరలు విపరీతంగా పెరిగిపోయి మధ్యతరగతి ప్రజలకు ఆర్థిక భారంగా మారిన విషయం తెలిసిందే. ప్రజల నుంచి ప్రభుత్వం విమర్శలు ఎదుర్కోవడంతో అధికారులు దిగివచ్చారు. సబ్సిడీపై టమోటా, వంట నూనెలు అందిస్తున్నారు. ఇందులో భాగంగా ఎంవీపీ రైతుబజార్‌లో గురువారం సబ్సిడీ వంట నూనెలను అందుబాటులోకి తీసుకొచ్చారు. దీని కోసం ప్రత్యేకంగా కౌంటర్‌ను జిల్లా పౌర సరఫరాల అధికారి భాస్కరరావు, జిల్లా వాణిజ్య విభాగం మార్కెటింగ్ ఇన్‌చార్జి రాకేష్ ప్రారంభించారు. వినియోగదారులకు సబ్సిడీ నూనె అందజేశారు. సన్‌ఫ్లవర్ ఆయిల్ లీటర్ గోల్డ్‌డ్రాప్ రూ.128, బ్రిస్టల్ రూ.130, ఫ్రీడం రూ.120కు విక్రయిస్తున్నారు. వీటితోపాటు ఇక్కడ టమోటా కిలో రూ.50, ఉల్లిపాయలు కిలో రూ.32కు విక్రయిస్తున్నారు. కార్యక్రమంలో రైతుబజార్ ఈవో ప్రసాద్, కనకరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

దక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు


దక్షిణామూర్తికి పూజలు చేస్తున్న భక్తులు

మద్దిలపాలెం: కొత్త వెంకోజీపాలెం శ్రీ గౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో కొలువైన దక్షిణామూర్తికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దసరా ఉత్సవాల్లో భాగంగా స్వామిని భక్తులు దర్శించుకుని అభిషేకాలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు ఆరవెల్లి సూర్యప్రకాష్ శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి, బాలభాస్కరశర్మ భక్తుల పేరిట అర్చనలు చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఎన్‌ఎస్‌ఈఐటీ కేంద్రం పరిశీలన


కేంద్రాన్ని పరిశీలిస్తున్న యూఐడీఏఐ అధికారులు

మహారాణిపేట: ఆధార్ ఆపరేటర్లకు పరీక్షలు నిర్వహించే యూఐడీఏఐ కేంద్రాన్ని గురువారం అధికారులు పరిశీలించారు. ద్వారకానగర్‌లో ఉన్న ఈ కేంద్రంపై చాలా ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు ఈ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఇక్కడ తప్పిదాలు గుర్తించినట్టు తెలిపారు. యూఐడీఏఐ అధికారులపై కూడా ఇక్కడి సిబ్బంది దురుసుగా ప్రవర్తించినట్టు తెలిసింది. యూఐడీఏఐ ప్రాజెక్టు మేనేజర్ జావీద్, సచివాలయ ఆధార్ కోఆర్డినేటర్ ఈ కేంద్రాన్ని పరిశీలించారు.

12న విజయదశమి ఉత్సవం.. రావణ వధ

డాబాగార్డెన్స్: ఈ నెల 12న గంభీరంలోని హరేకృష్ణ వైకుంఠ మందిర ప్రాంగణంలో పెద్ద ఎత్తున విజయదశమి ఉత్సవాలు, రావణ వధ నిర్వహించనున్నట్టు హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి శ్యామమాధవ దాస పేర్కొన్నారు. గురువారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ వివరాలు వెల్లడించారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ విశాఖపట్నం ఆధ్వర్యంలో తొలిసారిగా విజయ దశమి ఉత్సవాలు జరుగుతాయన్నారు. బాణసంచాతో తయారు చేసిన 20 అడుగుల ఎత్తుగల రావణ వధను వైకుంఠ మందిర ప్రాంగణంలో నిర్వహించనున్నట్టు చెప్పారు. అగ్నిప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలతో ఉత్సవం నిర్వహిస్తామన్నారు.

కరుణించి కాపాడే దుర్గమ్మ తల్లి


దుర్గాదేవి అవతారంలో శాంతిస్వరూపిణి


రేసపువానిపాలెం శాంతిస్వరూపిణి ఆలయంలో సామూహిక కుంకుమ పూజల్లో అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు

ఆరిలోవ: దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 12వ వార్డు చినగదిలి నార్త్ షిర్డీసాయిబాబా మందిరం కాంప్లెక్స్‌లోని పోలమాంబ ఆలయంలో ఘనంగా పూజలు జరుగుతున్నాయి. గురువారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అష్టోత్తరాలు చదువుతూ కుంకుమ పూజ చేశారు. పెదగదిలిలో ఏర్పాటు చేసిన మండపంలో దుర్గాదేవికి స్థానికులు పూజలు నిర్వహించారు. మండప ఆవరణలో ప్రతిష్ఠించిన విష్ణుమూర్తి దశావతారాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి.


చినగదిలి పోలమాంబ ఆలయంలో అష్టోత్తరాలు చదువుతూ పూజలు చేస్తున్న భక్తులు

మహిషాసుర మర్దినిగా దుర్గాదేవి

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ 20వ వార్డు డిఫెన్స్ అపార్ట్‌మెంట్స్ దరి ఈస్ట్ షిర్డీసాయి ఆటోస్టాండ్ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వేడుకల్లో బాగంగా గురువారం దుర్గాదేవి మహిషాసుర మర్దినిగా దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, మహిళ భక్తుల ఆధ్వర్యంలో కుంకుమ పూజా, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శుక్రవారం మహా అన్నదానం నిర్వహిస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు.

చండికాదేవి ఆలయంలో దీపారాధన

ఎంవీపీ కాలనీ సెక్టార్–4లోని శ్రీ చండికాదేవి ఆలయం వద్ద నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం దీపారాధన నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ఓంకారం, స్వస్తిక్ ఆకారాల్లో దీపాలు వెలిగించారు. సామూహిక కుంకుమార్చనలు, అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు చేశారు. పలువురు భక్తులు భక్తి సంకీర్తనలు ఆలపించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పొట్టి రమణ, ప్రతినిధులు శ్రీహరిరాజు, ఉమాదేవి, శ్రీనివాసరావు, రామమోహనరావు, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.


20వ వార్డులో దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


చండికాదేవి ఆలయ ఆవరణలో దీపారాధన చేస్తున్న భక్తులు, కమిటీ ప్రతినిధులు

కేజీహెచ్ ఏడీ రక్తదానం

మహారాణిపేట: కేజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ శ్రీనివాస్ కుమార్ జన్మదినం సందర్భంగా గురువారం స్వయంగా రక్తదానం చేశారు. దీంతో సిబ్బంది ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ మేనేజర్ పి.ఎం.జవహర్, ఏపీ ఎంప్లాయీస్ అసోసియేషన్ సిటీ అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, సిబ్బంది నూకరాజు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బెంగాలీ సంస్కృతికి విశిష్ట స్థానం


దసరా వేడుకల్లో పాల్గొన్న సీపీ శంఖబ్రత బాగ్చీ దంపతులు

అల్లిపురం: మాతృభాషకు ఇచ్చే ప్రాధాన్యం, సంస్కృతి, సంప్రదాయాలు కొనసాగేందుకు చేసే కృషి బెంగాలీలను విశిష్ట స్థానంలో నిలిపాయని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. రైల్వేస్టేషన్ దరి కాళీబరి మందిర్‌లో వాల్తేర్ కాళీ బరి, సర్బో జనిన్ ఈస్ట్ కోస్ట్ రైల్వే దుర్గా పూజా కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న దసరా ఉత్సవాల్లో ఆయన సతీ సమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ 64 ఏళ్లుగా కాళీబరిలో దుర్గా పూజా ఉత్సవాలు నిర్వహించడం అపూర్వ విషయమన్నారు. నగర ప్రజలకు ఒక్క ఫోన్ కాల్ దూరంలో ఉంటానన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ సతీమణి బెంగాలీ గీతం ఆలపించి ఆహుతులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో సుమిత్ బెనర్జీ, జయదేవ్ చక్రవర్తి, ఉపాధ్యక్షుడు బిమల్ దర్, కోశాధికారి ప్రహ్లాద్ మజుందార్, ప్రాంతీక్ ముఖర్జీ తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధనల సందడి


28వ వార్డులో అన్నదానం చేస్తున్న పల్లా దుర్గారావు


22వ వార్డులో అన్నప్రసాదం వడ్డిస్తున్న పీతల గోవింద్

బీచ్‌రోడ్డు: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 28వ వార్డు పందిమెట్టలో గురువారం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.

- 22వ వార్డు రాజీవ్‌నగర్‌లో నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహా అన్నదానం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్ భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇసుకతోటలో అన్నదానం

మద్దిలపాలెం: ఇసుకతోట జాతీయ రహదారి పక్కనున్న కనకదుర్గ ఆలయంలో మహిళలచే కుంకుమాభిషేకం జరిపారు. గురువారం మధ్యాహ్నం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో మహిళలు, భక్తులు, శ్రీ సీతారామ సేవా మండలి సభ్యులు పాల్గొన్నారు.


ఇసుకతోటలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

కనుల పండువగా కలశాల ఊరేగింపు

మద్దిలపాలెం: దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలో భాగంగా గురువారం 16వ వార్డు ఇసుకతోట రజక వీధిలో కలశాల ఊరేగింపు కనుల పండువగా నిర్వహించారు. భవానీ మాలధారులు, స్థానిక మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వారంతా తలపై కలశాలను పెట్టుకుని మేళతాళాల నడుమ ఊరేగింపుగా ఉత్సవ మండపం వరకూ వెళ్లి దుర్గాదేవి అమ్మవారికి సమర్పించారు.


ఇసుకతోట రజక వీధిలో కలశాలు ఊరేగిస్తున్న భక్తులు, భవానీ మాలధారులు

తోపుడుబండ్ల వ్యాపారుల ఉపాధికి రక్షణ కల్పించాలి


మాట్లాడుతున్న తోపుడుబండ్ల సంఘం నాయకులు

మద్దిలపాలెం: మద్దిలపాలెం ప్రధాన రహదారి పక్కన ఆర్టీసీ కాంప్లెక్స్ గోడకు ఆనుకుని 20 ఏళ్లుగా చిరువ్యాపారాలు సాగిస్తున్న తోపుడుబండ్ల కార్మికుల ఉపాధికి రక్షణ కల్పించాలని తోపుడుబండ్ల సంఘం మద్దిలపాలెం జోన్ గౌరవ అధ్యక్షుడు పి.వెంకటరావు కోరారు. తోపుడుబండ్ల వద్ద గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మద్దిలపాలెం వద్ద 32 మంది తోపుడుబండ్ల కార్మికులు వ్యాపారాలు చేస్తున్నారని, అద్దె షాపుల పేరుతో వారిని ఆర్టీసీ యాజమాన్యం తొలగించడానికి ప్రయత్నించడం సరికాదన్నారు. హైవే ఫేసింగ్‌లో అద్దె షాపులు నిర్మించడం వల్ల ట్రాఫిక్ సమస్యలు వస్తాయని, అక్కడ షాపులు కట్టకూడదని కోరారు. న్యాయవాది పి.వి.గిరిధర్ మాట్లాడుతూ మద్దిలపాలెం తోపుడుబండ్ల కార్మికులకు లీగల్‌గా సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. విశాఖపట్నం తోపుడుబండ్ల చిల్లర వర్తకుల కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అంగుడు సింహాచలం మాట్లాడుతూ తమ సమస్యలపై జీవీఎంసీ కమిషనర్, కలెక్టర్, ఎస్‌హెచ్‌ఏ పీడీ, వీఎంఆర్‌డీఏ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చామని, మా ఉపాధికి రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సీఐటీయూ సీనియర్ నాయకుడు అనపర్తి అప్పారావు మాట్లాడుతూ మద్దిలపాలెం హైవేలో తోపుడుబండ్ల కార్మికులను తొలగిస్తే నగరం మొత్తం తోపుడుబండ్ల కార్మికులను కదిలించి జీవీఎంసీని ముట్టడిస్తామని హెచ్చరించారు. సీఐటీయూ నాయకులు కె.కుమారి, మద్దిలపాలెం తోపుడుబండ్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎం.గణేష్, వై.సాయి మాట్లాడారు. మద్దిలపాలెం హైవే సెంటర్ తోపుడుబండ్ల కార్మికులు 32 మంది పాల్గొన్నారు.

డాక్టర్ సరస్వతికి నేదునూరి స్మారక పురస్కారం


డాక్టర్ సరస్వతి విద్యార్థిని స్మారక పురస్కారంతో సత్కరిస్తున్న వీఎంఏ ప్రతినిధులు

మద్దిలపాలెం: విశాఖకు చెందిన గాత్ర విద్వన్మణి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ సంగీత విభాగ పూర్వ అధిపతి ఆచార్య డాక్టర్ సరస్వతీ విద్యార్థికి విశాఖ మ్యూజిక్ అకాడమీ(వీఎంఏ) ప్రతి ఏటా అందించే సంగీత కళానిధి నేదునూరి కృష్ణమూర్తి స్మారక పురస్కారాన్ని ప్రదానం చేసింది. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో గురువారం ఆమెకు అకాడమీ అధ్యక్షుడు రామమూర్తి, ఉపాధ్యక్షులు రాజారావు, డాక్టర్ పేరాల బాలమురళి, గౌరవ కార్యదర్శి శ్రీనివాస్, కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి దుర్గాప్రసాద్, సహ కార్యదర్శులు అయ్యగారి భుజంగరావు, మంథా జ్వాలప్రసాద్‌ల చేతుల మీదుగా చందనమాల, శాలువా, జ్ఞాపికలు సమర్పించి పురస్కారంతో ఘనంగా సత్కరించారు. సభా కార్యక్రమానంతరం డాక్టర్ సరస్వతి విద్యార్థి గాత్ర కచేరీకి వాయులీనంపై డా.మావుడూరి సత్యనారాయణశర్మ(ఆముదాలవలస), మృదంగంపై విద్వాన్ కొమ్మాజోస్యుల సద్గురుచరన్ (విజయవాడ), ఘటంపై విద్వాన్ హరిబాబు(గుంటూరు) సహకరించగా.. చక్కని గాత్రంతో ఆమె శ్రోతల మన్ననలు పొందారు.

క్యాంపస్ డ్రైవ్‌లో ‘గైస్’ విద్యార్థుల సత్తా

మురళీనగర్: కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌లో ఉద్యోగాల కోసం కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్)లో గురువారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో గైస్ విద్యార్థులు సత్తా చాటారు. ఇప్పటికే ఈ కాలేజీ నుంచి 150 మందికిపైగా ఉద్యోగాలు సాధించడంతోపాటు అత్యధికంగా రూ.10 లక్షల ప్యాకేజీతో ఒక విద్యార్థి ఉద్యోగం సాధించిన విషయం విదితమే. తాజాగా ఈ కాలేజీ నుంచి 10 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరిలో ఇద్దరు అమ్మాయిలున్నారు. బి.విజయశ్రీ కార్తీక్, ఆళ్ల మౌనిక ప్రియ, జె.శ్రావణి శృతి, ఆదరి గణేష్, దొడ్డి జగదీశ్ చక్రి, బి.మోహన్ కుమార్, పి.లక్ష్మణ్ చరణ్, జి.బాలాజీ, ఎంవీ నరేష్ వర్మ, బి.షణ్ముఖరావు కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి మొదటి సంవత్సరం రూ.2లక్షల వార్షిక ప్యాకేజీ ఇస్తారు. రెండో ఏడాది నుంచి రూ.3 లక్షల ప్యాకేజీ చెల్లిస్తారని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ చెప్పారు. వివిధ విభాగాల అధిపతులు డాక్టర్ బీవీ లక్ష్మణరావు, సీహెచ్.జయప్రకాష్‌రెడ్డి, డి.దామోదర్, డాక్టర్ ఎస్.ప్రశాంతకుమారి విద్యార్థులను అభినందించారు.

నిరాశ్రయ వసతి గృహాలకు పోలీసు మద్దతు

నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

అల్లిపురం: నిరాశ్రయ వసతి గృహాలకు పోలీసుల మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవం సందర్భంగా ఏయూటీడీ జీవీఎంసీ షెల్టర్ సిబ్బంది, ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు ఆధ్వర్యంలో గురువారం కమిషనర్ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పోలీస్ డిపార్ట్‌మెంట్ నుంచి నిరాశ్రయుల సంరక్షణకు తమ మద్దతు ఉంటుందన్నారు. అక్టోబర్ చివరి శనివారం నాడు స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో జరిగే సమావేశంలో ఏయూటీడీని ఆహ్వానించి నిరాశ్రయుల సమస్యలపై చర్చిద్దామని కమిషనర్ హామీ ఇచ్చారు.